సాక్షి
నల్లగొండ

ఆదివారం । 24 । ఆగస్టు । 2025



యాదగిరిగుట్టలో భక్తుల రద్దీ

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని శనివారం 35వేల మందికి పైగా భక్తులు దర్శించుకున్నారు.

- 8లో



పండ్ల రారాజుకు సెలవు

ఎర్రపహాడ్‌కు చెందిన దేశ్‌ముఖ్ జెన్నారెడ్డి శ్యాంసుందర్‌రెడ్డి అంత్యక్రియలు శనివారం స్వగ్రామంలో పూర్తయ్యాయి.

- 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : **590** అడుగులు

ప్రస్తుత నీటి మట్టం	:	**584.50** అడుగులు
ఇన్‌ఫ్లో	:	**4,09,193** క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:	**4,09,193** క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	:	**29,232** క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	:	**9,019** క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	:	**7,518** క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	:	**2,400** క్యూసెక్కులు
వరద కాల్వకు	:	**300** క్యూసెక్కులు

న్యూస్‌రీల్

నవరాత్రులను ప్రశాంతంగా జరుపుకోవాలి

• ఎస్పీ శరత్ చంద్ర పవార్

నల్లగొండ : వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ శరత్ చంద్ర పవార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అధిక శబ్దం కలిగించే లౌడ్ స్పీకర్లు, డీజేలకు అనుమతి లేదని పేర్కొన్నారు. గణేష్ విగ్రహాల వద్ద నిర్వాహకులు స్పీకర్లను తక్కువ సౌండ్‌తో రాత్రి 10 గంటల వరకు మాత్రమే వినియోగించాలని తెలిపారు. నిర్వాహకులు మండపం ఏర్పాటు చేసే స్థలం యాజమానుల అనుమతులు తీసుకోవాలని, విద్యుత్ శాఖ అనుమతితోనే కనెక్షన్ తీసుకోవాలని, షార్ట్ సర్క్యూట్ జరుగకుండా నాణ్యత గల వైరు ఉపయోగించాలని, మండపాలు ఉన్న రహదారిలో ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా చూసుకోవాలని, ప్రతి మండపం వద్ద సీసీ కెమెరాలు విధిగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మండపాల్లో అనుమానాస్పదంగా బ్యాగులు, ప్లాస్టిక్ సంచులు, వస్తువులు, వ్యక్తులు కనిపిస్తే 100 నంబర్‌కు సమాచారం అందించాలని పేర్కొన్నారు.

26న జాబ్‌మేళా

నల్లగొండ : నల్లగొండలోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఈ నెల 26న ఉదయం 10.30 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎస్.పద్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మేళాలో ఎంపికైన అభ్యర్థులు నల్లగొండ, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో పని చేయాలని.. నెలకు రూ.10 వేలు నుంచి రూ.25 వేలు వేతనం ఉంటుందని తెలిపారు. ఎస్ఎస్‌సీ నుంచి డిగ్రీ, డీ,బీ,ఎం.ఫార్మసి విత్ పీసీఐ సర్టిఫికెట్ కోర్సు చదివి ఉండి 18 నుంచి 30 సంవత్సరాల వయసు గల వారు అర్హులని తెలిపారు. పూర్తి వివరాలకు 7893420435 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

అభినవ్ స్టేడియంలో ‘ఈశా’ గ్రామోత్సవం

నల్లగొండ : ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నల్లగొండలోని మేకల అభినవ్ అవుట్‌డోర్ స్టేడియంలో శనివారం గ్రామోత్సవం నిర్వహించారు. వివిధ రకాల క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. పురుషుల వాలీబాల్‌లో 15 జట్లు, మహిళల త్రోబాల్‌లో 10 జట్లు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా గాయత్రి పేరిణీ నృత్యం అందర్నీ అలరించింది. అనంతరం కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో అదనపు ఎస్పీ జి.రమేష్, డిప్యూటీ ఎస్ఓ అక్బర్ అలీ, సతీష్, రామకృష్ణ, విమల, కవిత, శ్రీనివాస్, వెంకట్‌రామ్‌రెడ్డి ఉన్నారు.

చెర్వుగట్టులో లక్ష పుష్పార్చన



లక్ష పుష్పార్చన పూజ నిర్వహిస్తున్న అర్చకులు

నార్కట్‌పల్లి : అమావాస్య సందర్భంగా శనివారం రాత్రి మండలంలోని చెర్వుగట్టు శ్రీపార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవాలయంలో లక్ష పుష్పార్చన నిర్వహించారు. అమావాస్య కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి పెద్ద సంఖ్యలో విచ్చేశారు. ఎలాంటి ఇబ్బందలుంఉ కలగకుండా దేవాలయ శాఖ సిబ్బంది, పోలీసులు తగు చర్యలు తీసుకున్నారు. పూజల్లో ప్రధాన అర్చకులు పోతులపాటి రామలింగేశ్వరశర్మ, సతీష్‌శర్మ, సురేష్‌శర్మ, శ్రీకాంత్‌శర్మ, ఈఓ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.



నల్లగొండలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో సెల్ఫ్ డిఫెన్స్ తరగతుల్లో పాల్గొన్న మహిళా సిబ్బంది


మహిళా పోలీసులకు సెల్ఫ్ డిఫెన్స్‌లో శిక్షణ

నల్లగొండ : మహిళ పోలీస్ సిబ్బందికి నల్లగొండలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్ సెల్ఫ్ డిఫెన్స్‌పై శిక్షణ ఇచ్చారు. శనివారం ముగిసిన శిక్షణకు ఎస్పీ శరత్ చంద్ర పవార్ హాజరై మాట్లాడారు. శిక్షణ తీసుకున్న మహిళా సిబ్బందికి ఆత్మస్థైర్యం పెరుగుతుందని, నేర నియంత్రణ, శాంతి భద్రతలు పరిరక్షణ, అన్ని రకాల విధులు నిర్వహించగలుగుతారని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీ మౌనిక, ఎస్‌బి సిఐ రాము, మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ కరుణాకర్, ఆర్ఐ సంతోష్, మహిళా ఎస్ఐలు, పోలీసులు పాల్గొన్నారు.

పరిష్కారం అరకొరే..!

భూ భారతి దరఖాస్తులకు కలగని మోక్షం

- క్షేత్రస్థాయిలో కుస్తీలు పడుతున్న తహసీల్దార్లు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులు 1,02,768
- వాటిలో 3,996 అప్లికేషన్లకే మోక్షం
- అయినా పరిష్కారంలో నల్లగొండ జిల్లానే ముందంజ



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన భూభారతిలో సమస్యలు అరకొరగానే పరిష్కారమవుతున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తులకు.. పరిష్కారానికి పొంతన లేదు. ఆగస్టు 15 నాటికి భూ సమస్యలు పరిష్కరిస్తామని ప్రభుత్వం చెప్పిన విషయం తెలిసిందే. అయితే గ్రామస్థాయిలో పరిష్కారానికి అనుకూలంగా లేనివే అధికంగా ఉండటంతో వాటి పరిష్కారానికి తహసీల్దార్లు ఇబ్బందులు పడుతున్నారు. అయినప్పటికీ రాష్ట్రంలో అధిక దరఖాస్తులు పరిష్కరించిన జిల్లాల్లో నల్లగొండ ముందు స్థానంలో ఉండటం గమనార్హం.

పరిష్కారానికి సిద్ధంగా 8,384 దరఖాస్తులు

ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా వివిధ భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తుల్లో పావలావంతు కూడా పరిష్కారానికి నోచుకోలేదు. రెవెన్యూ సదస్సుల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,02,768 దరఖాస్తులు వచ్చాయి. వాటిల్లో 3,996 దరఖాస్తులను మాత్రమే ఇప్పటి వరకు అధికారులు పరిష్కరించగలిగారు. పరిష్కారానికి సిద్ధంగా మరో 8,384 దరఖాస్తులు ఉన్నాయి. వాటిని తహసీల్దార్లు వారి స్థాయిలో పరిశీలించి.. ఆర్డీఓ, అదనపు కలెక్టర్, కలెక్టర్ లాగిన్లకు పంపించారు. వారి లాగిన్ నుంచి అప్‌లోడ్ చేస్తే ఆయా దరఖాస్తులకు సంబంధించిన సమస్యలు పరిష్కారం కానున్నాయి.

సమస్యల పరిష్కారంలో ఎన్నో అడ్డంకులు

భూ సమస్యలు పరిష్కరించే విషయంలో క్షేత్రస్థాయిలో తహసీల్దార్లకు తంటాలు తప్పడం లేదు. సాదాబైనామా విషయం కోర్టులో ఉండటంతో ఆ దరఖాస్తులను పక్కన పెట్టారు. ప్రొహిబిషన్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్ (పీఓటీ) పరిధిలో ఉన్న అసైన్డ్ భూములకు సంబంధించిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచారు. మిగిలిన టీఎం 33 భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు పరిష్కరిస్తున్నారు. ఇందులో పొతిల్లో కుటుంబ సభ్యుల మధ్య విభేదాల కారణంగా పరిష్కారం కానివి చాలా ఉన్నాయి. వాటి పరిష్కారం కోసం తహసీల్దార్లు నానా తంటాలు పడాల్సి వస్తోంది. కోర్టు కేసులు, ఇతర భూ సమస్యలకు సంబంధించి మొండి కేసులే అధికంగా ఉండటంతో తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నారు. కొందరికి భూమి ఉండి కాగితాలు లేవు. అలాంటి వాటి విషయంలో పరిష్కారానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

దరఖాస్తుల పరిష్కారంలో నల్లగొండే ముందు

రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల పరిధిలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూ సమస్యలపై దరఖాస్తులు తీసుకున్నారు. భూ భారతిలో వాటిని పరిష్కరించే క్రమంలో అధికంగా నల్లగొండ జిలాల్లోనే 2,633 దరఖాస్తులు పరిష్కరించారు. తక్కువగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మొత్తం దరఖాస్తులు 61,145 వచ్చాయి. వాటిల్లో పరిష్కారమైంది 99 మాత్రమే. నల్లగొండ జిల్లాలో 43,545 దరఖాస్తులు వస్తే అందులో 2,633 దరఖాస్తులు పరిష్కరించి రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచింది.

భూభారతి దరఖాస్తుల పరిస్థితి ఇలా..

జిల్లా	దరఖాస్తులు	పరిష్కరించినవి
నల్లగొండ	43,545	2,633
సూర్యాపేట	44,741	551
యాదాద్రి	14,482	812
మొత్తం	1,02,768	3,996

నల్లగొండ ఎంతో నచ్చింది

నీలగిరిలో సందడి చేస్తున్న ఫ్రాన్స్ దేశస్తుడు

- వారం రోజులుగా స్థానిక ప్రజలతో మమేకం
- నిత్యం జాతీయ గీతాలాపన.. ధ్యానం, యోగా
- భారతీయ ఆహారం, సంస్కృతిపై మక్కువ చూపుతున్న ఆడ్రిన్



భారతీయ సంప్రదాయ దుస్తుల్లో ఆడ్రిన్

మా ఊరు అతిథి

నాకు నల్లగొండ ఎంతో నచ్చింది అంటున్నాడు ఫ్రాన్స్ దేశానికి చెందిన ఆడ్రిన్. వారం క్రితం నల్లగొండకు వచ్చిన ఆయన శివాజీనగర్ పిరమిడ్ ధ్యాన కేంద్రంలో ఉంటూ వివిధ ప్రదేశాల్లో సందడి చేస్తున్నాడు. ఇక్కడి వారితో కలిసిపోయి అందరితో సరదాగా గడుపుతున్నాడు. శనివారం ఆయనను ‘సాక్షి’ పలకరించగా.. దేశ పర్యటన విశేషాలను పంచుకున్నాడు. వివరాలు ఆయన మాటల్లోనే..

రామగిరి(నల్లగొండ) : నాకు పర్యటనలు అంటే ఎంతో ఇష్టం. ఎంఎస్ కార్పొరేట్ ఫైనాన్స్ పూర్తి చేసిన నేను ఫ్రాన్స్ రైల్వేస్‌లో డేటా మేనేజర్‌గా పని చేస్తున్నాను. 2011లో మొదటిసారి ఢిల్లీలోని థీంటెక్ కంపెనీకి స్టడీ ఎక్స్ఛేంజ్ కార్యక్రమానికి ఇండియా వచ్చాను. ఇక్కడి సంస్కృతి, సంప్రదాయాలు నాకు ఎంతో నచ్చాయి. ఇప్పటికి ఎనిమిది సార్లు ఇండియాలో పర్యటించాను. నేపాల్ దేశాన్ని కూడా సందర్శించాను. ఇండియాలోని 14 రాష్ట్రాలు తిరిగాను. ఎక్కువగా ఆధ్యాత్మిక ప్రదేశాలను వీక్షించాను. ఇక్కడి హిమాచల్‌ప్రదేశ్, రాజస్థాన్, లడక్, టిబెట్ అంటే నాకు ఎంతో ఇష్టం.

ధ్యానం ఇష్టం

ఈ ఏడాది జూలైలో ఢిల్లీకి వచ్చాను. రాజస్థాన్‌లోని జైపూర్, లడక్, కార్గిల్‌ను సందర్శించాను. అమర్‌నాథ్ యాత్రకు వెళ్లాను. ఆగస్టులో హైదరాబాద్ వచ్చి.. అక్కడి నుంచి నాగార్జునసాగర్ విపాసన ధ్యాన కేంద్రానికి వెళ్లాను. వారం రోజుల పాటు అక్కడ ధ్యానంలో శిక్షణ తీసుకున్నాను. అక్కడికి వలంటీర్‌గా వచ్చిన నల్లగొండ మండలం కంచనపల్లికి చెందిన నితిన్‌తో పరిచయం ఏర్పడింది. అతని ఆహ్వానం మేరకు ఆగస్టు 17న కంచనపల్లికి వచ్చాను.



నల్లగొండ శివాజీనగర్‌లోని పిరమిడ్ కేంద్రంలో ధ్యానం చేస్తున్న ఆడ్రిన్



నల్లగొండ సమీపంలో నాట్లు వేసే కూలీలతో ఆడ్రిన్

ఇండియా గొప్ప దేశం

ఇండియా గొప్ప దేశం. ఇక్కడ ప్రతి రాష్ట్రంలో ఒక విభిన్నమైన సంస్కృతి ఉంది. అనేక భాషలు మాట్లాడుతారు. పర్యాటక ప్రాంతాలు చాలా ఉన్నాయి. ఇటీవల వెళ్లిన అమర్‌నాథ్ యాత్ర ఎంతో అనుభూతిని ఇచ్చింది. ఇండియాలో నేను ఎక్కువగా నార్త్ ఇండియా సందర్శించాను. ఇప్పుడు మొదటిసారి సౌత్ ఇండియాకు వచ్చాను. ఇండియాలో నేర్చుకున్న ధ్యానం జీవనానికి, ఉద్యోగరీత్యా చాలా ఉపయోగపడుతుంది. హిందూ, బుద్ధిజం అంటే ఇష్టపడతాను. తీరిక సమయాల్లో రామాయణం, భగవద్గీత చదువుతాను.



నల్లగొండలో స్థానికులతో కలిసి నిత్య జాతీయ గీతాలాపనలో పాల్గొన్న ఆడ్రిన్

నిత్య జాతీయ గీతాలాపన బాగుంది..

నల్లగొండ పట్టణం చాలా బాగుంది. వారం రోజులు ఇక్కడ గడిపాను. రోజూ ఉదయం బీజేపీ కార్యాలయంలో యోగా శిక్షణకు హాజరవుతున్నాను. ఇక్కడ అందరూ ఇష్టంగా నాతో సెల్ఫీలు దిగుతున్నారు. నల్లగొండలోని బిర్యానీ, దోశ, చాయ్ బాగున్నాయి. పానగల్ ఆలయాన్ని సందర్శించాను. కంచనపల్లి గ్రామంలో నాట్లు వేసే కూలీలతో సరదాగా గడిపాను. నాకు భారతదేశ సంస్కృతి ఎంతో ఇష్టం. నల్లగొండలో రోజూ ఉదయం జాతీయ గీతాలాపన చేయడం నాకు ఎంతో నచ్చింది. నేను కూడా భారతదేశ జాతీయ జెండా పట్టుకుని జాతీయ గీతం ఆలపించాను.

ఎన్‌ఎఫ్‌బీఎస్ దరఖాస్తులు సమర్పించాలి

• కలెక్టర్ ఇలా త్రిపాఠి



దేవరకొండలో వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ : జాతీయ కుటుంబ ప్రయోజన పథకం (ఎన్ఎఫ్‌బీఎస్) కింద అర్హత ఉన్న వారి దరఖాస్తులను వారం రోజుల్లోగా సమర్పించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. జాతీయ కుటుంబ ప్రయోజన పథకంపై శనివారం ఆమె కలెక్టరేట్‌లో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులు జనవరి 1, 2024 నుంచి మరణించిన వారి వివరాలను సేకరించి ఎంపీడీఓలకు పంపాలన్నారు. ఎంపీడీఓలు ఆ జాబితాను తహసిల్దార్లకు సమర్పించాలని ఆదేశించారు. మున్సిపల్ స్థాయిలో మున్సిపల్ కమిషనర్లు జాబితాను పంపించాలని చెప్పారు. జిల్లాలో అర్హత ఉన్న వారంతా లబ్ధి పొందేవిధంగా కృషి చేయాలన్నారు. శనివారంలోపు తహసీల్దార్లు దరఖాస్తులన్నీ పరిశీలించి ఆర్డీఓకు పంపాలని.. ఆర్డీఓలు ఆన్‌లైన్‌లో జిల్లా రెవెన్యూ అధికారికి సమర్పించాలని పేర్కొన్నారు. అనంతరం తాను పరిశీలించి ప్రభుత్వానికి పంపుతానని తెలిపారు. కార్యక్రమంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి, డీపీఓ వెంకయ్య పాల్గొన్నారు.

కుటుంబ నియంత్రణపై అవగాహన కల్పించాలి

దేవరకొండ : గ్రామీణ ప్రాంత ప్రజలకు కుటుంబ నియంత్రణపై అవగాహన కల్పించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శనివారం దేవరకొండ మండలం బొడ్డుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలోని ఓపీ రిజిస్టర్, సిబ్బంది హాజరు, ఐరన్, ఫోలిక్ మాత్రల పంపిణీ, నమోదైన సీజనల్ వ్యాధుల వివరాలను పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. పీహెచ్‌సీలో సాధారణ ప్రసవాలు అయ్యేలా చూడాలని సూచించారు. అనంతరం మండల పరిధిలోని ముదిగొండ ప్రభుత్వ ఆశ్రమ బాలికల వసతి గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వసతి గృహంలోని వంటగది, డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. వంటగది నుంచి బయటికి వెళ్లే వృథా నీరు, బాత్ రూమ్‌లకు ఓపెన్ డ్రెయినేజీ ఉండడంపై అసహనం వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ రమణారెడ్డి, తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

‘ప్రీప్రైమరీ’ 20 ఏళ్ల క్రితమే ప్రారంభించాల్సింది

• ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

పెద్దవూర : ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతుల నిర్వహణ ఇరవై ఏళ్ల క్రితమే తీసుకోవాల్సిన నిర్ణయమని ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. ఉత్తమ ఎంఈఓ అవార్డు గ్రహీత తరి రాములు సన్మాన కార్యక్రమం శనివారం పెద్దవూర జెడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఈ యేడాది కొన్ని పాఠశాలల్లోనే ప్రీ ప్రైమరీకి అనుమతిని ఇచ్చిందని.. అన్ని పాఠశాలల్లోనూ అమలు చేయాలని డిమాండ్ చేశారు. తాను రాజకీయ పార్టీలకు దూరంగా ఉండి కేవలం ఉపాధ్యాయుల సమస్యలపైనే శాసనమండలిలో గళమెత్తుతానని తెలిపారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కాలం నారాయణరెడ్డి, మేకల జానారెడ్డి, నాయకులు కోమటిరెడ్డి నర్సింహారెడ్డి, గాదె వెంకట్‌రెడ్డి, ఇరుమాది పాపిరెడ్డి, దుర్గాప్రసాద్, దండ వీరారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, భిక్షంగౌడ్, రూపా, దేవేందర్, నామిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఆర్‌సీరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

యూరియా కోసం అన్నదాతల బారులు



యూరియా పంపిణీ కేంద్రం వద్ద పోలీసులు

నిడమనూరు : నిడమనూరు పీఏసీఎస్‌కు శనివారం 445 బస్తాలు (18 టన్నులు) యూరియా వచ్చింది. దీంతో పెద్ద సంఖ్యలో యూరియా కోసం రైతులు సహకార సంఘం వద్దకు వచ్చారు. దీంతో ఎస్ఐ ఉప్పు సరేష్ ఆధ్వర్యంలో పోలీస్ పహారా నడుమ.. ఒక్కో రైతుకు 3 బస్తాల చొప్పున 148 మంది రైతులకు యూరియా పంపిణీ చేశారు. సగంమంది రైతులు యూరియా తీసుకోకుండానే వెనుదిరాగారు. గతేడాది ఏడాది సహకార సంఘం ద్వారా 1100 టన్నుల యూరియా విక్రయించగా, ఈ ఏడాది 400 టన్నులే విక్రయించామని సీఈవో జానయ్య వెల్లడించారు. సోమవారం మరో రెండు లారీల యూరియా వస్తుందని ఏఈఓ విజయచంద్ర తెలిపారు.



నిడమనూరు పీఏసీఎస్ వద్ద యూరియా కోసం క్యూ కట్టిన రైతులు

రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత : ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నార్కట్‌పల్లి : రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. శనివారం నార్కట్‌పల్లిలో ఏర్పాటు చేసిన ‘మిషన్ త్రిబుల్‌ఆర్’ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించారు. ఎక్కువగా ప్రమాదాలు జరిగే.. నార్కట్‌పల్లి ఫ్లై ఓవర్ బ్రిడ్జి, కామినేని ఆస్పత్రి, ఏపీ లింగోటం, గోపాలయపల్లి ప్రాంతాల్లో జీబ్రా క్రాసింగ్, రంబుల్ స్టిక్స్, సెంట్రల్ లైటింగ్, కాన్వేజ్ సేఫ్టీ మిర్రర్ వంటి చర్యలు తీసుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో సీఐ నాగరాజు, ఎస్ఐ క్రాంతి, రిటైర్డ్ సీఐ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

జీవాలకు పీపీఆర్ వ్యాక్సినేషన్

- 26 నుంచి సెప్టెంబర్ 10వ తేదీ వరకు గ్రామాల్లో టీకాలు
- 54 బృందాలను ఏర్పాటు చేసిన పశు సంవర్ధక శాఖ



నల్లగొండ అగ్రికల్చర్ : మేకలు, గొర్రెలకు పీపీఆర్ (పెస్టిడిస్ పెటైటిస్ రూమి నాంట్స్) వ్యాధి నిరోధక టీకాలను వేయనున్నారు. జిల్లా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 26 నుంచి సెప్టెంబర్ 10వ తేదీ వరకు అన్ని గ్రామాల్లోని గొర్రెలు, మేకలకు పీపీఆర్ టీకాలు వేయడానికి అన్ని ఏర్పాట్లు చేశారు. దీనికి అవసరమైన 54 బృందాలను ఏర్పాటు చేసి, వ్యాక్సిన్ సిద్ధం చేశారు. అన్ని పశువైద్యశాలలు, సబ్ సెంటర్లు, ప్రాథమిక, పశు వైద్య కేంద్రాలకు వ్యాక్సిన్ పంపుతున్నారు. ఆయా బృందాలు ఉదయం 7 గంటలకే గ్రామాలకు చేరుకుని 12 గంటల వరకు గొర్రెలు, మేకలకు టీకాలు వేయనున్నారు.

వ్యాధి వ్యాప్తి చెందే విధానం..

గొర్రెలు, మేకలలో మార్‌బిల్లివైరస్ వల్ల పీపీఆర్ అనే అంటు వ్యాధి సోకుతుంది. ఈ వ్యాధి జీవాలకు సరైన గాలి, వెలుతురు అందకపోవడం, కలుషిత ఆహారం, నీరు తీసుకోవడం, వర్షాల వల్ల వ్యాధి ఎక్కువగా వ్యాప్తి చెందుతుంది. వ్యాధి సోకిన జీవాలు మందలో ఉండడం వల్ల ఇతర జీవాలకు ఈవ్యాధి సోకుతుంది. వ్యాధి వచ్చిన జీవాలు విసర్జించే పేడ, స్రవాల ద్వారా ఈ వ్యాధి ఇతర జీవాలకు సోకుతుంది.

వ్యాధి లక్షణాలు..

వ్యాధి సోకిన గొర్రెలు, మేకల్లో అధిక జ్వరం రావడం కంటి నుంచి ముక్కు నుంచి నీరు కారడం, నోటిలో పొక్కులు ఏర్పడి జిగురుతో కూడిన విరేచనాలు రావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. అందుకే దీన్ని పారుడు వ్యాధి అంటారు. ఈ వ్యాధి ముదిరినప్పుడు ముక్కు నుంచి చీము కారడం, నోటిలోని చిగుళ్లపై, నాలుకపై పుండ్లు ఏర్పడతాయి. వ్యాధి సోకిన జీవాలు ఆకలి మందగించి మేత తినకపోవడం, విరేచనాలు, దగ్గు వంటి లక్షణాలతో 5 నుంచి 10 రోజుల్లో మరణిస్తాయి.

వ్యాధి నిర్ధారణ, చికిత్స ఇలా..

చనిపోయిన జీవాలు శవ పరీక్ష చేసినప్పుడు చిన్న పేగులు, పెద్ద పేగుల్లో రక్తపు చారలు కనిపించడం ద్వారా శ్వాసకోశ, జీర్ణావస్థకు సంబంధించిన లక్షణాల ద్వారా వ్యాధిని గుర్తింవచ్చు. ఈ వ్యాధికి సరైన చికిత్స లేదు. పశు వైద్యులను సంప్రదించి చికిత్స అందించడం ద్వారా జీవాలను కాపాడుకోవచ్చు. పశువైద్యుడి సలహా మేరకు వ్యాధి లక్షణాలు బట్టి యాంటి బయాటిక్ మందులు వాడుకోవాలి. నోటి పుండ్లు తగ్గడానికి బోరిక్ యాసిడ్ కలిపిన గ్లిజరిన్ పూయాలి. మేత మేయని జీవాలకు జావ, అంబలి తాగించాలి.

పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలి

జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఈ నెల 26 నుంచి సెప్టెంబర్ 10వ తేదీ వరకు పీపీఆర్ టీకాలు వేయనున్నాం. గొర్రెల, మేకల పెంపకందారులు, తమ గొర్రెలు, మేకలకు టీకాలను విధిగా వేయించుకుని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

డాక్టర్ జి.వి.రమేష్,
జిల్లా పశు వైద్య సంవర్ధక శాఖ అధికారి

క్లుప్తంగా

తల్లి మందలించిందని యువకుడి ఆత్మహత్య


శ్రీధర్ (ఫైల్)

గుర్రంపోడు: తల్లి మందలించిందని మనస్తాపానికి గురైన యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన శనివారం గుర్రంపోడు మండలం మొసంగి గ్రామంలో జరిగింది. ఎస్ఐ పసుపులేటి మధు తెలిపిన వివరాల ప్రకారం.. మొసంగి గ్రామానికి చెందిన బొంగరాల శ్రీధర్(21) ఏ పని చేయకుండా ఖాళీగా తిరుగుతుండడంతో అతడి తల్లి వెంకటమ్మ మందలించింది. దీంతో మనస్తాపం చెందిన శ్రీధర్ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి లింగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైలు కింద పడి..

తిప్పర్తి: రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన తిప్పర్తి మండలం రాయినిగూడెం గ్రామ సమీపంలో శుక్రవారం రాత్రి జరిగింది. రైల్వే ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 50 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి శుక్రవారం రాత్రి రాయినిగూడెం గ్రామ సమీపంలో చైన్నై ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుడికాలు తొలగించబడి ఉన్నట్లు రైల్వే తెలిపారు. ఘటనా స్థలంలో ఎలాంటి ఆధారాలు లభించలేదని పేర్కొన్నారు. నల్లగొండ స్టేషన్ మాస్టర్ నవీన్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్ఐ తెలిపారు.

యువకుడి అదృశ్యం

చౌటుప్పల్: ఆఫీస్‌కి వెళ్లిన యువకుడు ఇంటికి తిరిగిరాకుండా అదృశ్యమయ్యాడు. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో వెలుగులోకి వచ్చింది. శనివారం చౌటుప్పల్ సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా మాచవరం మండలం మోర్జంపాడు గ్రామానికి చెందిన గడిపూడి మురారి(30) హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. అతడికి మూడేళ్ల క్రితం వివాహం అయ్యింది. మూడు నెలల క్రితం భార్యాభర్తల మధ్య గొడవ జరిగడంతో మురారి భార్య అలిగి పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మురారి యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని విద్యానగర్‌కాలనీలో నివాసముంటున్న తన అక్క కాంచన వద్దకు వచ్చాడు. ఇక్కడే ఉంటూ రోజూ హైదరాబాద్‌లో ఆఫీస్‌కి వెళ్లి తిరిగి రాత్రికి వస్తుండేవాడు. రోజుమాదిరిగానే ఈ నెల 18న ఉదయం మురారి ఆఫీస్‌కి వెళ్లాడు. అదేరోజు రాత్రి అతడికి తన అక్క ఫోన్ చేయగా.. ఇంటికి వస్తున్నా అని చెప్పాడు. కానీ వెళ్లలేదు. ఆ తర్వాత రెండు రోజులు అతడి ఫోన్ ఆన్‌లో ఉన్నప్పటికీ.. ఫోన్ చేసినా సమాధానం ఇవ్వలేదు. తన తమ్ముడు హైదరాబాద్‌లో ఏదైనా పనిమీద ఉన్నాడేమోనని భావించిన కాంచన అంతగా పట్టించుకోలేదు. 21వ తేదీ నుంచి మురారి సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ అయిపోయింది. దీంతో శనివారం అతడి అక్క కాంచన చౌటుప్పల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

వాహనదారులపై వడ్డన

సేవా రుసుములు పెంచిన రవాణా శాఖ

- గతంలో కంటే రెట్టింపు చేస్తూ జీఓ జారీ
- ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే ఫీజు తక్కువే..
- ఏజెంట్ల ద్వారా వెళ్తే మరింత ఆర్థిక భారం



సూర్యాపేట జిల్లా రవాణా శాఖ కార్యాలయం

తిరుమలగిరి (తుంగతుర్తి) : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రవాణా శాఖ సేవా రుసుములు పెంచింది. గతంతో పోలిస్తే దాదాపు రెట్టింపు చేస్తూ గత నెల 22న జీఓ నంబర్ 51 విడుదల చేసింది. ఈ ఉత్తర్వులు తక్షణమే అమలులోకి తీసుకొచ్చింది. ఇందుకు సంబంధించి ఆర్టీఏ సర్వర్‌లో మార్పులు చేశారు. జీఓ విడుదలైన వెంటనే సూర్యాపేట జిల్లాలోని సూర్యాపేట, కోదాడ ఆర్టీఏ కార్యాలయాల్లో పెంచిన రుసుములతో సేవలు అందుబాటులోకి వచ్చాయి. రవాణా శాఖ అధికారులు పెరిగిన రుసుముల వివరాలు కార్యాలయం నోటీస్ బోర్డుపై ఏర్పాటు చేశారు. ఈ నిర్ణయంతో రవాణా శాఖకు ఆదాయం, వాహనదారులపై ఆర్థిక భారం పెరిగింది.

ప్రతిరోజూ 200 దరఖాస్తులు

సూర్యాపేట జిల్లాలోని సూర్యాపేట, కోదాడ ఆర్టీఏ కార్యాలయాల్లో ప్రతిరోజూ సరాసరి 200 దరఖాస్తులు వస్తుంటాయి. రవాణా శాఖ సేవా రుసుము పెంపు నిర్ణయంతో జిల్లా రవాణా శాఖకు ఆదాయం పెరిగింది. వాహనం నడిపే సమయంలో డ్రైవింగ్ లైసెన్స్, లెర్నింగ్ లైసెన్స్, వాహనాల రిజిస్ట్రేషన్ కార్డు తప్పనిసరిగా ఉండాల్సిందే. సొంతంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని ఆర్టీఏ కార్యాలయానికి వచ్చే వారికి సేవా రుసుము ఆన్‌లైన్ ఫీజు మాత్రమే ఉంటుంది. ఏజెంట్ల ద్వారా సేవలు పొందితే మరింత భారం తప్పేలా లేదు.

దరఖాస్తు చార్జీల పెంపు

రాష్ట్ర ప్రభుత్వం రవాణా శాఖకు సంబంధించి నూతన వాహనాల రిజిస్ట్రేషన్లు, డ్రైవింగ్, లెర్నింగ్ లైసెన్స్, పర్మిట్, సామర్థ్య పరీక్షలతోపాటు ఇతర సేవలపై అదనపు చార్జీలతోపాటు పన్నులను సైతం పెంచింది. వాహనం ఇన్వాయిస్ ధర ప్రకారం నూతన వాహనాల రిజిస్ట్రేషన్ పన్నులు పెంచారు. గతంలో రూ.50 మాత్రమే ఉండగా.. రూ.500 లోపు పన్నుకు రూ.50, రూ.500 కంటే ఎక్కువ ఉంటే రూ.100 అదనంగా వసూలు చేస్తున్నారు.

పెంచిన చార్జీలు ఇలా..

- లెర్నింగ్ లైసెన్స్ పరిమితి 6 నెలలు కాగా.. గతంలో రూ.100 ఉండగా ప్రస్తుతం రూ.200 చేశారు.
- డ్రైవింగ్ లైసెన్సులకు సంబంధించిన పీవీసీ స్మార్ట్ కార్డుల సేవా రుసుము ఐదేళ్ల కాల పరిమితికి లైట్ మోటారు వాహనం రూ.200 నుంచి రూ.300కు, 20ఏళ్ల లోపు నాన్ ట్రాన్స్‌పోర్టు వాహనాలకు రూ.300 నుంచి రూ.400కు పెంచారు.
- వాహనాల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి పీవీసీ, స్మార్ట్ కార్డులకు నాన్ ట్రాన్స్‌పోర్టు వాహనాలకు 0.5 శాతం, ట్రాన్స్‌పోర్టు వాహనాలకు 0.1 శాతం పన్ను, 3 చక్రాల వాహనాలకు ఏడాదిలోపు రూ.250 నుంచి రూ.300లకు, ఏడాది కంటే ఎక్కువగా ఉంటే రూ.300 నుంచి రూ.500 వరకు అదనపు చార్జీలు విధించారు.
- ఫిట్‌నెస్ ధ్రువీకరణ పత్రాల మంజూరుకు రెండేళ్లలోపు రూ.100 నుంచి రూ.200, రెండేళ్లకుపైన రూ.200 నుంచి రూ.300లకు పెంచారు.
- వాహన పర్మిట్ చార్జీలను గతంలో ఉన్న చార్జీల కంటే రూ.100 చొప్పున అదనంగా వసూలు చేస్తున్నారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి



రాష్ట్ర ప్రభుత్వం రవాణా శాఖ సేవా రుసుమును గత నెలలో పెంచింది. వాహనదారులు ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులకు సంబంధించిన రుసుములు చెల్లించి సేవలు పొందవచ్చు.

– ఎస్.జయప్రకాష్‌రెడ్డి, డీటీఓ, సూర్యాపేట

యాదగిరిగుట్టలో భక్తుల రద్దీ


ఆలయ ముఖ మండపంలో స్వామివారి దర్శనం కోసం క్యూలో నిల్చున్న భక్తులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. దీంతో ఆలయ పరిసరాలు, క్యూలైన్లు, ప్రసాద విక్రయశాల, కొండ కింద భక్తులు ఎక్కువగా కనిపించారు. స్వామివారి ధర్మ దర్శనానికి రెండున్నర గంటలకు పైగా, వీఐపీ దర్శనానికి 30నిమిషాలకు పైగా సమయం పట్టింది. స్వామిని 35వేలకు పైగా భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. వివిధ పూజలతో నిత్యాదాయం రూ.32,50,356 వచ్చినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

శాస్త్రోక్తంగా యాదగిరీశుడి నిత్యకల్యాణం

యాదగిరిగుట్ట ఆలయంలో గురువారం నిత్యకైంకర్యాల్లో భాగంగా స్వామి, అమ్మవారి నిత్యకల్యాణ వేడుక వైభవంగా నిర్వహించారు. ప్రధానాలయ అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలతో అలంకరించి గజవాహన సేవలో తీర్చిదిద్ది సేవోత్సవం చేపట్టారు. కల్యాణ మండపంలో అధిష్ఠింపజేసి, విష్వక్సేనుడి తొలిపూజలతో కల్యాణతంతు పూర్తిచేశారు. ముందుగా ప్రభాతవేళ గర్భాలయంలో స్వామి,అమ్మవార్లను సుప్రభాత సేవతో మేల్కొలిపిన అర్చకులు.. నిజాభిషేకం, నిత్యార్చనలు చేశారు. అనంతరం ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం, బ్రహ్మోత్సవం తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం వెండి జోడు సేవలను ఆలయ మాడవీధిలో ఊరేగించారు. రాత్రి స్వామివారికి శయనోత్సవం చేసి ఆలయ ద్వార బంధనం చేశారు.

హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ప్రసన్నకుమార్

చివ్వెంల(సూర్యాపేట): భర్తతో పాటు అతడి ఇద్దరి భార్యలపై హత్యాయత్నం చేసిన నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సూర్యాపేట డీఎస్పీ ప్రసన్నకుమార్ శనివారం చివ్వెంల పోలీస్ స్టేషన్‌లో విలేకరులకు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. చివ్వెంల మండలం అక్కలదేవిగూడెం గ్రామానికి చెందిన దండుగుల లక్ష్మయ్య మొదటి భార్యతో కుడకుడ గ్రామానికి చెందిన దండుగుల శేఖర్ వివాహేతర సంబంధం పెట్టుకోవడంతో.. గతంలో ఇరు కుటుంబాల మధ్య గొడవలు జరిగగా.. పెద్దమనుషుల మధ్య పంచాయితీ పెట్టి సమస్యను పరిష్కరించుకున్నారు. కేసులు పెట్టుకుని రాజీపడ్డారు. కానీ శేఖర్ మాత్రం లక్ష్మయ్య, అతడి మొదటి భార్యపై పగ పెంచుకున్నాడు. సూర్యాపేటలోని సుందరయ్య నగర్‌కు చెందిన శేఖర్ స్నేహితుడు పల్లపు గోపి ఇంటి నిర్మాణానికి లక్ష్మయ్య వద్ద రాయి కొనుగోలు చేశాడు. రాయికి సంబంధించిన డబ్బులు ఇవ్వాలని లక్ష్మయ్య గోపిని విసిగిస్తుండడంతో.. శేఖర్, గోపితో పాటు వారి స్నేహితులైన టేకుమట్ల గ్రామానికి చెందిన పల్లపు రాము, రాయినిగూడెం గ్రామానికి చెందిన పసుపుల చంటి కలిసి శుక్రవారం చివ్వెంల పోలీస్ స్టేషన్‌కు బైక్‌పై వెళ్తున్న లక్ష్మయ్య, అతడి ఇద్దరి భార్యలను కారులో వెంబడించి వారిపై దాడి చేశారు. ప్రాణాలు కాపాడుకునేందుకు లక్ష్మయ్య, అతడి భార్యలు బీబీగూడెం గ్రామ శివారులోని మధుర వైన్స్‌లో వెళ్లి దాచుకున్నారు. దీంతో శేఖర్, గోపితో పాటు వారి స్నేహితులు అక్కడ నుంచి పరారయ్యారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ వి. మహేశ్వర్ కేసు నమోదు చేసి శనివారం నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ టెన్నిస్ క్వాలిఫైయింగ్ పోటీలు ప్రారంభం

భువనగిరి: భువనగిరి పట్టణంలోని సువాలి ఎస్టేట్‌లో శనివారం అంతర్జాతీయ స్థాయి టెన్నిస్ క్వాలిఫైయింగ్ పోటీలు ప్రారంభమయ్యాయి. యాదాద్రి భువనగిరి జిల్లా టెన్నిస్ అసోసియేషన్, న్యూ డైమెన్షన్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్వాలిఫైయింగ్ పోటీల్లో తొలిరోజు అండర్–18 జూనియర్ బాలబాలికల విభాగంలో 48 మంది పాల్గొన్నారు. ఇందులో యూఎస్ఏ, ఆస్ట్రేలియా, ఇండియా తదితర దేశాలకు చెందిన టెన్నిస్ క్రీడాకారులు తలపడ్డారు. ఇందులో క్వాలిఫై అయిన క్రీడాకారులకు ఈ నెల 25 నుంచి ప్రధాన పోటీలు జరగనున్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు సద్ది వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు దిడ్డి బాలాజీ, కార్యదర్శి ఖలీం అహ్మద్, సంయుక్త కార్యదర్శి పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

బాలికను వివాహం చేసుకున్న కానిస్టేబుల్

- పోక్సో కేసు నమోదు
- వివాహాన్ని ప్రోత్సహించిన బాలిక తల్లి, ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై కూడా కేసు

సూర్యాపేటటౌన్: బాలికను నాల్గో వివాహం చేసుకున్న కానిస్టేబుల్‌పై సూర్యాపేట రూరల్ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. శనివారం ఎస్ఐ బాలునాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. చివ్వెంల మండల పరిధిలోని తుల్జారావుపేట గ్రామ పంచాయతీకి చెందిన బానోతు కృష్ణంరాజు నడిగూడెం పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గతంలో మూడు పెళ్లిళ్లు చేసుకున్న కృష్ణంరాజు 2023 డిసెంబర్‌లో సూర్యాపేట మండలంలోని సపావట్‌తండాకు చెందిన మైనర్ బాలికను నాలుగో వివాహం చేసుకున్నాడు. ఇటీవల అతడు ఐదో పెళ్లికి కూడా సిద్ధమవ్వగా.. ఈ వ్యవహారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ మునగాల సీఐ రామకృష్ణారెడ్డిని విచారణ అధికారిగా నియమించారు. విచారణ అనంతరం కానిస్టేబుల్ కృష్ణంరాజును సస్పెండ్ చేస్తూ ఈ నెల 12న ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే సపావట్‌తండాకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు భూక్య నారాయణ వదిన కొడుకే కృష్ణంరాజు కాగా.. నారాయణ, బాలిక తల్లి కలిసి.. ఆమెను కృష్ణంరాజుకు ఇచ్చి వివాహం చేశారని బాలిక తండ్రి సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కానిస్టేబుల్ కృష్ణంరాజుపై పోక్సో కేసు నమోదు చేయడంతో పాటు వివాహాన్ని ప్రోత్సహించిన బాలిక తల్లి, ప్రభుత్వ ఉపాధ్యాయుడు నారాయణపై చైల్డ్ మ్యారేజీ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ బాలునాయక్ తెలిపారు.

లైటింగ్ మెరుగుపర్చాలి

- ఈఓ వెంకట్రావ్

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట క్షేత్రానికి లైటింగ్ మరింత మెరుగుపర్చాలని ఈఓ వెంకట్రావ్ సంబంధిత అధికారులకు సూచించారు. శనివారం రాత్రి ఆయన ఆలయ క్యూలైన్లు, లైటింగ్ ప్రదేశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భక్తులను ఆకర్షించే విధంగా లైటింగ్‌ను మెరుగుపర్చాలన్నారు. అంతేకాకుండా ఆలయ భద్రత, క్యూలైన్ల నిర్వహణ సరిగ్గా ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులందరికీ ఉచిత ప్రసాదం తప్పనిసరిగా అందించాలన్నారు. అంతకుముందు భక్తులతో మాట్లాడి వసతి సదుపాయాలు, సౌకర్యాలు, ప్రసాదం ఏర్పాట్లపై ఆరా తీశారు. ఆయన వెంట ఆలయాధికారి కృష్ణ, ఆర్ఐ శేషగిరిరావు తదితరులున్నారు.


ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న ఈఓ వెంకట్రావ్

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శన



యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ సన్నిధిలో శనివారం రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. హైదరాబాద్‌కు చెందిన కృష్ణవేణి కళా నిలయం కళాకారులు భరతనాట్యం ప్రదర్శించారు.



భువనగిరి: భువనగిరి మండల పరిధిలోని రాయగిరి మినీ శిల్పారామంలో శనివారం హైదరాబాద్‌లోని మంజీర డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ నృత్య ప్రదర్శనను పర్యాటకులు ఆసక్తిగా తిలకించారు.

మూసీకి కొనసాగుతున్న వరద

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి వరద నీటి రాక కొనసాగుతోంది. శనివారం సాయంత్రం వరకు ప్రాజెక్టుకు 4,368 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో ప్రాజెక్టు అధికారులు నాలుగు క్రస్ట్‌గేట్లను పైకెత్తి 2,600 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. అదేవిధంగా మూసీ కుడి, ఎడమ కాల్వలకు 530 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 645 అడుగులు (4.46 టీఎంసీలు) కాగా.. ప్రస్తుత నీటిమట్టం 643.70 అడుగుల (4.13 టీఎంసీలు) వద్ద ఉందని ప్రాజెక్టు అధికారులు పేర్కొన్నారు.

స్వయం ఉపాధి సాంకేతిక కోర్సుల్లో ఉచిత శిక్షణ

భూదాన్‌పోచంపల్లి: యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం జలాల్‌పురంలో గల స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో మేధా చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో తెలంగాణలోని నిరుద్యోగ యువతకు ఉపాధి ఆధారిత సాంకేతిక కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ చైర్మన్ ఎన్. కిషోర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆరు నెలల కాలవ్యవధి గల కంప్యూటర్ హార్డ్‌వేర్, సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ వస్తువుల రిపేర్, సీసీ టీవీ టెక్నీషియన్ కోర్సుకు పదో తరగతి విద్యార్హత కల్గి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. టైలరింగ్, ఎంబ్రాయిడరీ, జర్దొజీ, క్విల్ట్ బ్యాగుల తయారీ కోర్సుకు 8వ తరగతి పాసై ఉండాలని తెలిపారు. ఎలక్ట్రీషియన్ (డొమెస్టిక్), సోలార్ సిస్టమ్ ఇన్‌స్టాలేషన్ అండ్ సర్వీస్ కోర్సుకు ఐటీఐ లేదా ఇంటర్ విద్యార్హత ఉండాలని పేర్కొన్నారు. అదేవిధంగా మూడు నెలల కాలవ్యవధి గల అడ్వాన్స్ వెల్డర్, వెల్డింగ్ అండ్ ఫ్యాబ్రికేషన్ కోర్సుకు పదో తరగతి విద్యార్హత ఉండాలని చెప్పారు. అభ్యర్థులు 18 నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్సు కల్గి ఉండాలని, చదువు మధ్యలో ఉన్నవారు మాత్రం అర్హులు కాదని అన్నారు. ఎంపికైన అభ్యర్థులకు శిక్షణా కాలంలో ఉచిత భోజనంతో కూడిన హాస్టల్ వసతి కల్పించబడుతుందని వివరించారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు తప్పనిసరిగా ఉద్యోగం కూడా కల్పిస్తామని చెప్పారు. ఆసక్తి కల్గిన అభ్యర్థులు తమ విద్యార్హతల సర్టిఫికెట్లు ఒరిజినల్, జిరాక్స్, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో సెప్టెంబర్ 3న సంస్థలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు నేరుగా హాజరు కావాలని అన్నారు. మరిన్ని వివరాలకు 91339 08000, 91339 08111 నబర్లను సంప్రదించాలని సూచించారు.

జాతీయ సమైక్యత శిబిరానికి వలంటీర్ల ఎంపిక

నల్లగొండ టూటౌన్: నల్లగొండలోని ఎంజీ యూనివర్సిటీలో శనివారం జాతీయ సమైక్యత శిబిరానికి వలంటీర్లను ఎంపిక చేశారు. కేంద్ర ప్రభుత్వ క్రీడలు, యువజనుల సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో తమిళనాడు రాష్ట్రంలోని తంజావూర్‌లో సెప్టెంబర్ 18 నుంచి 24 వరకు జాతీయ సమైక్యత శిబిరాలు జరుగుతాయి. భాషా పరిజ్ఞానం, కమ్యూనికేషన్ స్కిల్స్, సాంస్కృతిక అంశాల్లో ఇంటర్వ్యూలు చేసి 10మంది విద్యార్థులను వలంటీర్లుగా ఎంపిక చేసినట్లు ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మద్దిలేటి తెలిపారు.

ఎంపికైంది వీరే..

బాలికల విభాగంలో రమావత్ మమత– ట్రైబల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాల, దేవరకొండ, తేజస్విని– గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ఉమెన్స్, నల్లగొండ , వైష్ణవి– సూర్యాపేట గురుకుల డిగ్రీ కళాశాల, ధనలక్ష్మి– చర్లపల్లి గురుకుల డిగ్రీ కళాశాల, పి. శ్రీవల్లి – సూర్యాపేట శ్రీవెంకటేశ్వర డిగ్రీ కాలేజీ.

బాలుర విభాగంలో శశికుమార్– బీసీ వెల్ఫేర్ డిగ్రీ కాలేజ్, సాగర్, కె. అరవింద్– గవర్నమెంట్ జూనియర్ కాలేజ్, పోచంపల్లి, అనుముల ప్రశాంత్– యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్, సోషల్ సైన్సెస్ ఎంజీయూ, విజయ్– బీసీ వెల్ఫేర్ జూనియర్ కాలేజ్ నల్లగొండ, మహేందర్– ఎన్టీఆర్ కాలేజ్, దేవరకొండ. ఎంపికైన వారిని వీసీ అల్తాఫ్ హుస్సేన్ అభినందించారు.

పండ్ల రారాజుకు సెలవు

- ముగిసిన శ్యాంసుందర్‌రెడ్డి అంత్యక్రియలు
- నివాళులర్పించిన ప్రముఖులు


శ్యాంసుందర్‌రెడ్డి (ఫైల్)

నూతనకల్: నూతనకల్ మండలం ఎర్రపహాడ్ గ్రామానికి చెందిన, పండ్ల రారాజుగా పేరుగాంచిన దేశ్‌ముఖ్ జెన్నారెడ్డి శ్యాంసుందర్‌రెడ్డి అంత్యక్రియలు శనివారం స్వగ్రామంలో పూర్తయ్యాయి. శ్యాంసుందర్‌రెడ్డి తండ్రి జెన్నారెడ్డి ప్రతాప్‌రెడ్డి నిజాం కాలంలో దేశ్‌ముఖ్‌గా పనిచేశారు. ప్రతాప్‌రెడ్డికి ఐదుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు సంతానం కాగా.. పెద్ద కుమారుడైన శ్యాంసుందర్‌రెడ్డి అగ్రికల్చర్ డిప్లొమా పూర్తిచేసి తనకు ఉన్న 800 ఎకరాల్లో మామిడి, బత్తాయి, సపోట వంటి పండ్ల తోటలు సాగుచేసి భారతదేశంతో పాటు ఆసియా దేశాలకు సైతం పండ్లు సరఫరా చేసి భారత ప్రభుత్వంచే పండ్ల రారాజుగా అవార్డు అందుకున్నారు. ఓపెన్ చానల్ ద్వారా నీటి సరఫరా చేసి వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు నాంది పలికారు. రాజకీయంగా ఎంతో మందికి అండదండలు అందించి ఉన్నత పదవుల్లో నిలిచేలా కృషిచేశారు. తుంగతుర్తి నియోజకవర్గం నుంచి ఇండిపెండెంట్‌గా పోటీ చేసి స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందారు. విద్యావ్యాప్తిలో భాగంగా హైదరాబాద్‌లో చైతన్య భారతి ఎడ్యుకేషన్ సొసైటీ ద్వారా సీబీఐటీ, ఎంజీఐటీ ఇంజనీరింగ్ కళాశాలలను స్థాపనలో పాలుపంచుకుని ఎంతో మంది పేద విద్యార్థులు ఉన్నత విద్యనభ్యసించే విధంగా కృషిచేశారు. శ్యాంసుందర్‌రెడ్డి మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డికి స్వయాన బావ. శ్యాంసుందర్‌రెడ్డి భౌతికకాయానికి మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, రైతు కమిషన్ సభ్యుడు రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, మహబూబాబాద్, సూర్యాపేట డీసీసీ అధ్యక్షులు జెన్నారెడ్డి భరత్‌సింహారెడ్డి, చెవిటి వెంకన్నయాదవ్, సూర్యాపేట, తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్‌లు కొప్పుల వేణారెడ్డి, తీగల గిరిధర్‌రెడ్డి, గుడిపాటి నర్సయ్య, తిరుమలప్రగడ అనురాధ, పోతు భాస్కర్, నాగం సుధాకర్‌రెడ్డి, గుంటకండ్ల చంద్రారెడ్డి తదితరులు నివాళులర్పించారు.


శ్యాంసుందర్‌రెడ్డి అంతిమయాత్రలో పాల్గొన్న గ్రామస్తులు



శ్యాంసుందర్‌రెడ్డి భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే సామేల్ తదితరులు

ఎస్ఆర్ ల్యాబొరేటరీస్‌లో అగ్ని ప్రమాదం

- షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం జరిగిందని ప్రాథమిక సమాచారం
- మంటలను అదుపు చేసిన అగ్నిమాపక సిబ్బంది


ఎస్ఆర్ ల్యాబొరేటరీస్ పరిశ్రమలో ఎగసిపడుతున్న మంటలు

చౌటుప్పల్ రూరల్: చౌటుప్పల్ మండలంలోని జైకేసారం గ్రామ పరిధిలోని ఎస్ఆర్ ల్యాబొరేటరీస్ పరిశ్రమలో శనివారం రాత్రి 9గంటల సమయంలో అగ్ని ప్రమాదం జరిగింది. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని ప్రాథమిక సమాచారం. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్ఆర్ ల్యాబొరేటరీస్ కెమికల్ పరిశ్రమలో శనివారం రాత్రి 9గంటలకు కార్మికులు డ్యూటీ షిఫ్ట్ మారే సమయంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా చిన్నగా మంటలు మొదలయ్యాయి. ఆ సమయంలో డ్యూటీలో ఆరుగురు కార్మికులు ఉన్నట్లు తెలిసింది. మంటలను గమనించిన కార్మికులు భయంతో పరిశ్రమ బయటకు పరుగులు తీశారు. కార్మికులు డయల్ 100కి ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన పరిశ్రమ వద్దకు చేరుకున్నారు. చౌటుప్పల్ అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ మంటల్లో రియాక్టర్లు పేలకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

భయాందోళనలో జైకేసారం గ్రామస్తులు..

గ్రామ పరిధిలోని ఎస్ఆర్ ల్యాబొరేటరీస్ కెమికల్ పరిశ్రమలో అగ్నిప్రమాదం జరగడంతో జైకేసారం గ్రామ ప్రజలు ఉలిక్కిపడ్డారు. గ్రామానికి సమీపంలో పరిశ్రమ ఉండడంతో మంటల్లో రియాక్టర్లు పేలి దాని తీవ్రత ఎంతగా ఉంటుందోనని భయాందోళనకు గురయ్యారు. సమాయానికి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేయడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఇదే కంపెనీలో గతంలో కూడా అగ్ని ప్రమాదం జరిగి కార్మికులు గాయపడిన ఉదంతాలు ఉన్నాయని గ్రామస్తులు చెబుతున్నారు.